# కొందరికి ఒకే ముగింపు

తండ్రి మంచంపట్టి ఏడాది దాటింది. తల్లి గతించి నాలు గేళ్లయింది. తల్లి చనిపోయేముందు మూడేళ్లు నానా హింస పడింది జబ్బుతో. కిరాణా కొట్టులో గుమాస్తాగా పాతికేళ్లు పనిచేసి అలసిపోయిన శరీరం భార్యను బ్రతికించుకోవటానికి ఇల్లు తాకట్టుపెట్టింది.

బరువు, బాధ్యతలను వదిలించుకొని భార్య పోయింది. ఇంటితాకట్టు మాత్రం అలాగే వుండిపోయిది. తల్లి పోవటంతో తండ్రి మతిపోయింది. ఇల్లు వల్లకాడే అయింది. ఎంతో కాలం కష్టం భరిస్తూ కాలేజీ మానని సుమిత్ర సంవత్సరం ఏలాగో ఓపిక పట్టినట్లయితే బి.ఏ. అయిపోయేది.

తల్లి గతించి, తండ్రి మంచంపడితే, తప్పనిసరి అయి, ఆమె చదువుకు స్వస్తిచెప్పింది. కిరణాకొట్టులో పాతికేళ్లు గాలిపీల్చి, ఓపికలేక వూపిరితిత్తులు మొండికెత్తాయి. చెడిపోయాయి. ఏడాది తిరక్కముందే ఇంట్లోవున్న చాలా సామాను అమ్ముడు పోయింది. సుమిత్రకు తెలిసినంతలో వంటపాత్రలు తప్ప ఇంట్లో అమ్మేందుకు చిల్లగవ్వ ఖరీదుచేసే వస్తువు లేదు.

క్షయతో పాడయిపోయిన గుండెమీాది కుంపటి సుమిత్ర. ఆమెకు పెళ్లి కాలేదు. పెళ్లి చేయలేదనే దిగులు అతని ఆవజీవాలు తోడేస్తూ వుంది.

కూతురు అచ్చటముచ్చట చూడలేదే అని తండ్రి కుమిలి పోతున్నాడు. జబ్బునుంచి కోలుకోలేననీ, తిరిగి మామూలు మనిషిని కాలేనని చింత! రెండు బాధల మధ్య బలహీనుడు ఆక్రోసిస్తున్నాడు.

సుమిత్ర చదువు సంగతి పూర్తిగా మరచిపోయింది. పెళ్లి ధ్యాస ఆసలే లేదు. తన ఆస్తిత్వం జీవితం తనకు సత్యం కావు, తనని తానే మరచిపోయింది. చిక్కి సగమయిపోయింది. ఇరవై ఏళ్ల సుమిత్ర ఒక్క ఏటికే ముప్పయి ఏళ్ల స్త్రీ అయింది.

భూమికెంత ఓర్పు ఉందో తెలియదుగాని సుమిత్రకు శక్తికి మించిన ఓర్పు వుంది. సూర్యుడు ఉదయించిం దగ్గర్నుంచి మళ్లీ సూర్యోదయం అయ్యేదిగా తండ్రి మంచం ప్రక్కనే! నిద్రలేదు. తిండి తిప్పలులేవు.

ఇంటిచుట్టూ అప్పులు పెరిగిపోయాయి. పాలు, పెరుక్కే కాదు. పప్పూ, బియ్యానికే కాదు. ఇంట్లో ఏం కావలసి వచ్చినా ఏదోవిధంగా అప్పు తప్పనిసరే అయింది. నోటు వ్రాసి అప్పుతెచ్చింది. చేబదుళ్లు తెచ్చింది. ఎంత తెచ్చినా ఖర్చే. తేవటమే కాని తిరిగి ఇవ్వటంలేదు. ఇవ్వగలిగే స్థితి లేదు. అప్పు పెరిగిపోవటంతో పుట్టటం మానివేసింది.

తండ్రికి పళ్లూ, పాలూ కావాలి. డబ్బులేదు. సుమిత్రకు దిగులు పుడుతూవుంది? ఏంచేయాలో తెలియటంలేదు. తండ్రి గమనించాడు. దగ్గరకు పిలిచాడు.

తండ్రి బీదకుటుంబంలోనే పుట్టాడు. పెరిగాడు. తండ్రి, తాత, ముత్తాతల దగ్గర్నుంచి పంచుకొన్న ఆస్తి బీదరికం ఆయన్ను విడిచిపోలేదు.

తల్లి ఉన్న యింట్లోనే పుట్టింది. ఆ రోజుల్లో వాళ్లిద్దరూ ప్రేమించుకొన్నారు. పెద్దవాళ్లకు ఇష్టంలేకుండా పెళ్లి జరిగింది.

వాళ్లకు సుమిత్ర ఒక్కతే కూతురు! సుమిత్ర పుట్టుకకు అమ్మమ్మ వచ్చింది. దొంగచాటుగా తాతయ్యకు తెలియకుండా వచ్చినప్పుడే ఒక హారం తెచ్చి ఇచ్చింది. అది అమ్మమ్మకు వాళ్ల అమ్మ ఇచ్చింది. ఆ హారం తరతరాలుగా అలా వస్తూంది.

హారం ధరించిన అందరూ పునిస్త్రీలుగా కాలం చేశారు. ఎవ్వరూ సౌభాగ్యం కోల్పోయి చనిపోలేదు. హారం ఒక్కసారి అయినా వేసుకొన్నవాళ్లు పసుపు కుంకాలతో గతించిపోయారు.

అమ్మమ్మ, అమ్మకు హారం ఇస్తూ పసిదానికోసం నా కానుక భద్రంచేయి. నేనున్నా, లేకపోయినా, గతించిన మన పూర్వీకుల సౌభాగ్యం. తలదాల్చి, నేను హారం రూపంలో పసిదాని మాంగళ్యం కాపాడుకొంటానని చెప్పింది.

హారం ధరించేముందు అమ్మ పూజచేసేది. అర్ధనారీశ్వర విగ్రహం ఎదుట దాచుకొనేది. పండుగలకు వేసుకొనేది. అది మూడు సంవత్సరాలనుంచి కనిపించటం లేదు. దాన్ని అమ్మలేదు.

దాని విషయం తప్ప ఇంట్లో వున్న అన్ని వస్తువులు ఏమయిందీ సుమిత్రకు తెలుసు. అసలే జబ్బుతో బాధపడుచున్న మనిషిని దాని సంగతి ఎత్తి, బాధపెట్టటం ఎందుకని సుమిత్ర ఎప్పుడూ ఆ ప్రసక్తి తీసుకురాలేదు.

తండ్రి పిలవగానే దగ్గరకుపోయి 'ఏం నాన్నా' అంది. తండ్రికి ఏం కావాలో తెలియక.

‘అమ్మా! నేనింకా బ్రతికినంత కాలం బ్రతకలేను తల్లీ’ అన్నాడు తండ్రి ‘అవేం మాటలు నాన్నా’ అంది బాధగా ఓర్పుగా.

కన్నీళ్లు పెట్టుకుంటూ ‘అవేం మాటలు కాదమ్మా! ఇంక నేను ఎంతో కాలం బ్రతకలేను’.

‘అలా అనొద్దు నాన్నా’ సుమిత్ర మృదువుగా వారించింది.

‘తల్లీ! నీలాంటి బిడ్డను కనుక్కొన్నందుకు మా భాగ్యానికి పొంగిపోతున్నానమ్మా’

‘ఏమీ మాట్లాడొద్దు నాన్నా!’ ఆమె చేయి తండ్రి నోటికి అడ్డంగా పెట్టింది.

మంచంమీంచి లేవలేని తండ్రి గొంతులోంచి దగ్గు తెర లేచింది. దగ్గిదగ్గి బలహీన మయిపోయి గొంతు రాపాడి జీర బోయింది.

సుమిత్ర తండ్రి గొంతు, గుండె చేతిలో నెమ్మదిగా సవరించింది.

‘ఇవాళో రేపో నేను పోతాను’ దగ్గు తగ్గింతర్వాత అన్నాడు.

‘అలా అనొద్దు నాన్నా’ అంటూ కన్నీరు పెట్టుకొంది సుమిత్ర.

‘నీతో ఒక్క మాట చెప్పాలమ్మా!’

‘చెప్పండి’.

కూతురు కన్నీరు తుడుస్తూ ‘నువ్వింకా నాకోసం ఖర్చు చేయనంటే మన కున్న ఆస్తి చెబుతానమ్మా!’

ఆ మాట వినేసరికి సుమిత్రకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. డబ్బువుంటే తండ్రిని బ్రతికించుకోవచ్చు ననుకొంది.

'చెప్పు నాన్నా! మన కేం ఆస్తి వుందీ చెప్పు!'

'ఖర్చు చేయనంటే చెబుతాను'.

'ముందు చెప్పండి.'

'నువ్వు మాట ఇవ్వు తల్లీ! ఈ ముసలి ప్రాణం కోసం నువ్వా ఆస్తి పాడు చేయకూడదు. చెప్పు మాట ఇస్తావా?'

'ఆఁ!' అంది. ఆస్తి విషయం చెబితే ఆ తర్వాత తండ్రి కిష్టంవున్నా లేకపోయినా తన ధర్మం తను చేయాలనుకొంది. 'మీ యిష్టప్రకారమే. చెప్పు నాన్నా?'

'మీ అమ్మ చనిపోతూ హారం నీ కిమ్మని చెప్పింది. ధన రూపంలో అది కొన్ని వేల ఖరీదు'. అది కాదు దాని రూపం. అది కొన్ని పవిత్ర ఆత్మల సౌభాగ్య స్వరూపం. దేవుడిచ్చిన దానితో సమానం. నీ తదనంతరం నీ కూతురి కివ్వాలి దీన్ని!'

సుమిత్రకు హారం విషయం గుర్తుకు వచ్చింది. వెంటనే అడిగింది 'ఎక్కడుందీ?'

తండ్రి తల ప్రక్కకు పెట్టుకొన్నాడు. దిండు తీయమని చెప్పాడు. దిండు తీసి ఇచ్చింది. బాకుతో దిండు కోశాడు.

తండ్రి చేస్తున్న ఆ పని తన హృదయం కోస్తున్నట్లు అయింది సుమిత్రకు. అందులో ఒక పెట్టి కనిపించింది. మూత తీశాడు. హారం! వజ్రాల హారం! మెరిసిపోతూ వుంది!

'ఎన్నో తరాలనుంచి ఇది చిరంజీవి. ఇంకెన్నో తరాలు అలాగే మిగలాలి తల్లీ'.

తండ్రి కళ్లు తుడుచుకొంటూ చెప్పాడు. లోలోన ఏమేమో ఆలోచించుకుంటూ 'అలాగే నాన్నా' అంది.

నీకు పెళ్లి చేయలేక పోయాననే వ్యథతో కుమిలి పోతున్నాను తల్లీ! కానీ ఈ హారం నీ దగ్గరేవుంటే దాని ప్రభావంవల్ల, నేనున్నా, లేకపోయినా, నీకు కళ్యాణప్రాప్తి కలుగుతుందని నమ్మకం, తల్లి నూరేళ్లు జీవించు తల్లీ'

తండ్రి హృదయపూర్వకంగా దీవించాడు. అంతలో దగ్గు ముంచుకువచ్చింది. ఇల్లంతా దద్దరిల్లిపోయేట్టు దగ్గాడు.

తండ్రి కోరికకంటే తన కోరిక ముఖ్యం. తన తండ్రిని తను బ్రతికించుకోవాలి. ఈ హారంవల్ల తండ్రి బ్రతుకుతాడు.

సుమిత్ర ఆలోచనలలోంచి తేరుకొంది.

—సుధ

*　　　*　　　*

## 2

సూర్యోదయం చూచి, భూమి వళ్లు విరుచుకొంది. లాడ్జిలో పదో నంబరు గదిలో మంచంమీద వున్న ఆమె వళ్లు విరుచుకోలేదు. ఆవులించలేదు. తల రేగివుంది. కళ్లు ఎరుపెక్కిపోయాయి. మత్తుగా, మగతగా వుంది. ఆమె రాత్రంతా నిద్రపోలేదు.

ఆమె ఆలోచనలు మధు చుట్టూ తిరుగుతున్నాయి. మధు కోసం ఎదురుచూచి, చూచి కళ్లు కాయలు కాచిపోయాయి. వాచిపోయాయి. ఇంకా వస్తాడింకా వస్తాడనే ఎదురు

చూడడంతోనే వారం గడిచిపోయింది. ఇప్పుడే వస్తానని వెళ్లిన మధు వారమయినా రాలేదు.

ఏడు రోజులు ఏడు యుగాలుగా ఎదురు చూచింది. ఆమె ఎదుర్కొన్న కష్టాలు లెక్కపెట్టటానికి తలలో వెంట్రుకలు చాలవు. ఇంతకాలం మధురోహలలో, నిరీక్షణలలో, జైలులో వున్నట్లు లాడ్జిలో వుంది.

రెండు వారాల క్రితం మధుతో ఆమె హైద్రాబాదు వచ్చింది. వారం రోజులు భూమిమీది స్వర్గం వుంటే, అది అందీ అందకుండా అనుభవించింది. ఆ తర్వాత వారం నరకం!

ఊరునుంచి బయలుదేరేముందు మధు చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు, వమ్మయిపోయాయి. పెళ్లి చేసుకోలేదు. ఇక చేసుకొంటాడనే నమ్మకంకూడా పోయింది.

మధు తల్లి, తండ్రులగూర్చి, చదువు, సంధ్యల గూర్చి, ఉద్యోగ సద్యోగాలగూర్చి ఆమె కేమీ తెలియదు. మధు అందంగా వున్నాడు. యువకుడు. తనను ప్రేమించాడు. అంతకంటే ఆమె కేమీ తెలియదు. రోజూ స్కూలుకు వెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ రోడ్డుమీద కనిపించేవాడు. తెల్లటి బట్టలు, మెరిసిపోయేటంతటి తెల్లటి బట్టలు ధరించేవాడు.

అతన్ని చూస్తూవుండేదామె రోజూ. వెన్నెలకంటే అందంగా, తెల్లగా, నవ్వుతూ కనిపించే మధు భర్త అయితే బాగుణ్ణు అనుకొంది.

స్కూల్ ఫైనల్ పరీక్ష వ్రాసి, ఇంటికి వస్తుంటే అతను మాట్లాడించాడు. ఆ మాటల్లో ఎంత ఆకర్షణ! ఎంత నేర్పు! ఎంత చొరవ! ఆమె ముగ్ధురాలయింది.

నాలుగు రోజుల్లో నగా నట్రా తీసుకొని, డబ్బూ, దస్కం చేత బట్టుకొని, బట్టలు పెట్టెలో పెట్టుకొని ఒక అర్ధ రాత్రి ఎవరికీ తెలియకుండా అతనితో బయలుదేరింది. హైదరాబాదు చేరారు. లాడ్జిలో దిగారు.

లాడ్జిలో భద్రంగా వుండవనీ, బ్యాంకులో దాచి వుంచుతాననీ, డబ్బూ, నగలు తీసుకొన్నాడు మధు. కాబోయే భర్తను శంకించటం తప్పని ఆమె ఏమీ మాట్లాడలేదు.

మధు వెళ్ళిపోతూ వదలిపోయిన డబ్బు ఇరవై రూపాయలు వారం రోజులకు సరిపోయాయి. ఆ రోజు ఉదయం రూపాయి మాత్రమే వుంది.

ఏం చేయాలో తెలియక ఉదయం ఎనిమిది గంటలయినా మంచంమీంచి లేవలేదు.

ఎంతో సేపు ఆలోచించి చివరికి మధుని వెదకాలని నిశ్చయించుకొంది. మధు కనిపించకపోతే ఉద్యోగరీత్యా వచ్చి మలక్ పేటలో వున్న బంధువులను కలుసుకొని, డబ్బు తీసుకొని లాడ్జి అద్దె చెల్లించి ఇంటికి వెళ్ళిపోవాలి. ఆమె గుండె రాయి చేసుకొంది.

మధు రాడనీ, డబ్బూ, శీలమూ, దొంగిలించి పారిపోయాడనీ, తనను పెళ్ళాడడనీ, వారం ఆలోచించి నిర్ణయించుకొంది.

వెంటనే లేచి రెండు నిమిషాల్లో తయారయింది. తలుపు తెసి, వెలుపలికి రాగానే క్రీగంటితో చూచే చుట్టుప్రక్కల రూంలవాళ్ళూ, వెకిలిపోకళ్ళుపోయే రూం బోయ్‌లూ, నవ్వుతూ పరిచయం చేసుకోబోయే లాడ్జి ఓనరూ కనిపించారు.

ఎక్కడలేని తెంపరితనంతో వాళ్ల వైపు చిరాకుగాచూస్తూ ముందుకు నడిచింది. వెనుక వినిపించే మాటలు లెక్క చేయకుండా సగం చచ్చిన గుండెతో మెట్లు దిగింది.

ఎటు నడవాలన్నది పెద్ద ప్రశ్న! చిక్కు ప్రశ్న. సమాధానంలేని విడదీయరాని చిక్కు ప్రశ్న! అటూ, ఇటూ చూచి ఎటు కాళ్లు సాగితే అటే లెమ్మని బయలుదేరింది.

ఆమె నడుస్తూ వుంది. టైం పదయింది. ఉదయంనుంచి ఏమీ తినలేదు. చేతిలో రూపాయి మాత్రమే వుంది.

ఎదురుగా పెద్ద హొటల్. భార్యాభర్తలో, ప్రేయసీ ప్రియులో రెండు జంటలు హోటల్‌లోకి పోతూ కనిపించాయి.

వాళ్లను చూడగానే మధుతో అలా వచ్చివుంటే బాగుండేది అనుకొంది. అంతలోనే యింకెక్కడ మధు అనుకొంది. మధు కనిపిస్తే ఎక్కడైనా బాగుండునని చూచింది.

భార్యా భర్తా హొటల్‌లోకి పోతున్నారు. భర్త చేతిలో జూవలరీ కేస్ కనిపించింది. ఆమెకు బంగారపు నగ ఏదో కొనిపెట్టి వుంటాడు. వాళ్లు సంతోషంగా హొటల్లోకి పోతున్నారు. చూడ ముచ్చటగా వున్నారు.

వాళ్ల వెనుకే ఆమె కూడా వెళ్లింది ఫ్యామిలీ సెక్షన్‌లో! ఎక్కడా కాళీలేక పురుషుడికి ఎదురుగా స్త్రీ ప్రక్కనే వాళ్ల టేబిలుదగ్గరే ఆమె కూర్చుంది.

వాళ్లు టిఫిన్ తీసుకొంటున్నారు. ఆమె అతని ముఖంలోకి చూస్తూ కూర్చుంది. ఏమీ తినటంలేదు. అతను ఆమె చూపులు గమనించాడు. భార్యకు తెలియకుండా ఆమె

వైపు ఓరగా చూస్తున్నాడు. భార్య తంతు పసి కట్టింది. చిరుబురులాడుతూవుంది.

దంపతులు కాఫీ తీసుకొంటున్నప్పుడే ఆమె కాఫీ తీసుకొంది. కాఫీ పూర్తయిం తర్వాత ఏం చేయాలో సమస్య అయింది. మధు ఎక్కడున్నాడని వెదకడం? హైద్రాబాద్ లోనే వున్నాడని నమ్మకం ఏముంది? హాయిగా, విలాసంగా, ఫేన్ గాలికి కూర్చుంది—తన దురదృష్టం తలచుకొంటూ.

ఎదురుగా వున్న భర్త, భార్య వుందనికూడా, గుర్తించకుండా వళ్లు మరచిపోయి, మత్తెక్కిన పిచ్చివాడిలాగా, ఆమె అందం కాఫీలాగా తాగుతూవున్నాడు.

భార్యకు చిరాకెత్తుకు వస్తున్నట్లు ఆమె గమనించింది. తనలోతానే విచారంతో కుమిలిపోయింది. ఎంతో సేపు అతని భార్య అక్కడుండటం సహించలేకపోయింది. 'పోదాం' అంది. అతను వినలేదు. 'మిమ్మల్నే—పోదాం' అంది. 'ఏమిటీ? పోదాం! పద!' ఇద్దరూ లేచారు. ఆమే కూర్చుండిపోయింది. వెనుదిరిగి చూచుకొంటూ వెళ్లిపోయాడు.

వెళ్లేటప్పుడు జూవలరీ కేస్, పూల పొట్లం మరచిపోయి మరీ వెళ్లారు. వాళ్లు వెళ్లింతర్వాత టేబిల్ మీద అవి చూచిందామె.

అతను వచ్చి, అవి తీసుకుపోవచ్చునని ఆమె అనుకొంది. ఎంతకీ అతను రాలేదు. అయిదు నిమిషాలు కూర్చునే ఎంతో సేపు కూర్చున్నాననుకొంది.

కేస్ ఓపెన్ చేసి చూచింది. కళ్లు జిగేల్ మన్నాయి. చాల ఖరీదయిన హారం! మూత వేసింది. పూల పొట్లం

విప్పి, మాల తీసి, తలలో తురుంకొంది. కేస్ తీసుకొని వెలుపలికి వచ్చింది.

అతను కనబడితే హారం ఇవ్వాలనుకొంది. అతనెక్కడా కనిపించలేదు. మధు జాడలేదు. రోడ్డుమీద తిరిగింది. ఆ హారం ఏంచేయాలో తెలియలేదు.

ఎండ నెత్తిమీదికి వచ్చేసరికి తల వేడెక్కి ఆలోచనలు చెలరేగాయి.

ఆ దండ అమ్మి డబ్బు తీసుకొని స్వగ్రామం వెళితే తప్పేముంది? ఆలోచించింది. తప్పు కనిపించలేదు. ఆ క్షణంనుంచి భయం వలయంగా మెదడంతా వ్యాపించింది. నిర్భయంగా ఉండటానికి ప్రయత్నం చేస్తూవుంది.

జూవలరీ కేస్ తీసుకొని, బంగారపు షాపులు ఎటున్నవో కనుక్కొని ఆమె నడక సాగించింది.

అంతకుముందే ఆ దగ్గరిలోవున్న పోలీస్ స్టేషన్‌లో బెజవాడనుంచి వచ్చిన ఆసామి ఒకాయన, తన కూతురు గుర్తులుచెప్పి నోరూ కాలూ లేని తన బిడ్డను ఎవడో లేపుకు వచ్చాడనీ, వాళ్లు హైదరాబాద్‌లోనే వుంటారనీ, తన బిడ్డను వెదికి తన కప్పగించమని ప్రార్థించాడు. సబిన్స్పెక్టర్ రిపోర్టు వ్రాసుకొన్నాడు.

దాదాపు ఆ సమయంలోనే, తన జూవలరీ కేస్ పోగొట్టుకొన్నాననీ, ఎదుటి వ్యక్తే తీసివుంటుందనీ, ఆమె పోలికలు చెప్పి వెళ్లిపోయాడొక యువకుడు.

సబిన్స్పెక్టర్ రిపోర్టు వ్రాసుకొన్నాడు.

* * * *

—రఘు.

# 3

మద్రాసు మెరీనా బీచ్. రాం—రమలు ఇసుకలో కూర్చున్నారు. రాం ముఖంలో విచిత్ర తృప్తి గోచరమవుతూ వుంది. రమ ముఖంలో వింత సత్యం కనబడుతూవుంది. రమ 'యల్.డి.సి.' రాం శ్రీమంతుల బిడ్డ. వాళ్ళిద్దర్నీ అకటిడకు చేర్చింది యౌవనం.

రాం ఆమెను ప్రేమిస్తున్నాడు. రమ అతనితో స్నేహం చేస్తుంది. రాం పెళ్ళాడదామంటే రమ స్నేహం తెంచివేసు కొందామంటుంది.

రమ నిత్యసంతోషి. రాం నిత్యప్రేమ భిక్షార్థి. రాం రమల ప్రణయం (మరొకరి మాటల్లో పరిచయం) పుష్పింపని మొగ్గ, మొగ్గతొడగని లత, లతలువేయని పాదు. పుట్టని మొక్క, గింజలులేని నేల.

రమ మెడ నిన్నటిదాకా బోసిగావుంది. ఇవాళ నిండుగా వుంది. తండ్రి డబ్బు, తల్లి చేతుల్లోంచివచ్చి, రాం జేబు లోంచి పోయి, షాపులో చేరింది. షాపులోంచి హారం బయలుదేరి, అతని చేతుల్లోంచి, ఆమె మెడలోకి సాగింది.

హారం అందంగావుంది. ఆమె మెడకు అందం రాలేదు. ఆమె మెడ అందంగావుంది. హారం సౌందర్యం ద్విగుణీకృత మయింది.

'నీ మెడలో హారం వెలుగులు వెదజల్లుతూవుంది. హృదయం పల్లవిస్తూవుంది. లేత చిగురుటాకువంటి నీ కంఠ భాగం కఠిన కర్కశ శిలవంటి ఈ హారం బరువుకు చెన్నుదరిగి మిన్నువిరిగి మన్నులో కలుపుతుందేమో! నా హృదయం

విలవిలలాడుతూ వుంది. కళవళపడుతూ వుంది. జవజవ లూడుతూ వుంది. నవనవలాడటం లేదు.'

'కవిత్వం కట్టిపెడతారా?'

'ఎక్కడ?'

'ఎక్కడ వీలుంటే అక్కడ!—రాం?'

'ఏం?'

'రమ నీది కాదనీ, కాలేదనీ, తెలిసి తెలిసీ ఎందుకీ తొందర! చెప్పు!' 'అది అనొద్దురమా! ఇంకా ఏమీ అనొద్దు, నేను భరించలేను. నా హృదయంలో కోటి చంద్రులు నువ్వు! కోటి సూర్యులు నీవు! కోటానుకోట్ల నక్షత్రాలు నువ్వు, సుధవూ, వెన్నెలవూ, అమృతానివీ, ఆనందానివీ, నా సర్వస్వం, నా సర్వసంపదా నువ్వు! నువ్వు వెలిగించిన నా హృదయం నువ్వు లేకపోతే ఆరిపోతుంది, ఆ ఏకటి సహింప లేను, నేను జీవింపలేను.'

'చూడు రాం' నేను మూర్తిని ప్రేమించాను. మూర్తి తప్ప వేరే లోకంలేదు నాకు. నామీద ఆశలు పెంచుకొని, 'నిన్ను నువ్వు నాశనం చేసుకోనద్దు!'

అలలు ముమ్మరంగా లేస్తున్నాయి. సముద్రం అల్లకల్లో లంగా, రాం హృదయంలాగా వుంది. నిలువెత్తున అలలు లేచి, తనని సముద్రం, తన గర్భంలో కలుపుకోగూడదా అనిపించింది.

'నా నిరీక్షణకు ఫలమింతేనా? నా వ్యధకు తుది ఇదేనా! నా కలలకు వెలుగిదేనా? ఇందుకేనా? నా జీవితం? ఇందు కేనా నా మనుగడ? ఎవరికోసం బ్రతకాలి? ఎవరికోసం జీవిత

యాత్ర సాగించాలి? ఇందుకేనా నేను పుట్టింది? చెప్పు రమా? చెప్పు!'

ఆమె ఆనందం పొందిందో, విచారంతో క్రుంగిందో, కళ్లకొనల కొసలనుంచి, ముత్యాలవంటి బిందువులు ఇసుకలో పడి కలిసిపోతున్నాయి. క్రమంగా సముద్ర గర్భంలోకి చేరుతాయి.

'రాం! దయతో నన్ను మరిచిపో! నీ ప్రేమతో నన్ను జయించకు. మూర్తిని ద్రోహం చేసుకోలేను.'

అతను బాధగా ఆమె నేత్రాంచల సంచలనపుటంచుల సొగసుసోయగాల నీడలలో నిద్రించే అనురాగ ధునీ నీరవ నీళీధిని నిశ్శబ్దం, రాగ రక్తిమతో పొంగులు వారుతున్న నిశ్చ జ్యోతిర్మయ కళాకాంతుల సముదాయ స్థబ్దత, తిలకించాడు.

'అంతేనా? అంతేనా మిగిలింది? అంతేనా నా జీవిత పరమార్థం పరమావధి. పలుకు రమా?'

'అంతే!'

'నిన్ను మరచిపోవటం, నేలనో నింగినో మరచిపోవడం, నిన్ను చూడకుండావుండటం, పగలో చీకటిలో చూడకపోవటం, నీతో పలుకకపోవటం—కాదు—నిన్ను పలుకరించకపోవటమే నీకు ఇష్టమైతే అదీ నెరవేరుతుంది! నా కలలు నాకున్నాయి. నా హృదయం నాకుంది. హృదయంలోని సుందర రూపం, కలలలో ప్రత్యక్షం కాకపోదు. వస్తాను.'

రాం లేచాడు. పోవటానికి సంసిద్ధుడయ్యాడు. ఆమె చూస్తూ వూరుకుంది.

'నేనిప్పుడు వెళుతున్నాను. రేపు నువ్వు ఆహ్వానిస్తావు. ఆ ఆహ్వానంకోసమే ఈ కన్నీటి వీడ్కోలు.'

రెండడుగులు వేశాడు. ఆగి చెప్పాడు.

'ఇప్పుడు కాకపోయినా ఎప్పుడయినా డబ్బు కావలసివస్తే ముఖం దాచుకోకు. నీ ముఖచంద్రుడి కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తూ నేనొకణ్ణి వుంటానని మరచిపోకు.'

ఆమె మాట్లాడలేదు.

అతను వెనుదిరిగి చూచుకుంటూ వెళుతున్నాడు. ఆమె వెనక్కి రమ్మని పిలవకపోతుందా, అని. రమ కదలలేదు, మెదలలేదు. కాళ్లులేని రాయిలాగా ఇసుకలో కూర్చుండి పోయింది.

సముద్రం రేసుగుర్రంలాగా దూకుతూంది. ఉత్తుంగ తరంగాలు నింగినీలిమలో కరిమకళ్లు కద్దుకోజూస్తున్నాయి.

బంగాళా ఖాతంలో ఎక్కడో 'డిప్రెషన్' ఏర్పడింది. వాతావరణం మారిపోయింది. ప్రకృతే మారిపోయింది. ప్రకృతిలో ప్రకృతి అయిన రమ ప్రకృతిలో మార్పు రాలేదు.

నిన్న రాం కూర్చున్నచోట ఇవాళ మూర్తి కూర్చున్నాడు. ఉల్లోలకల్లోలిని ఎదుట రమ కల్లోల—ఉల్లంతో కూర్చుంది.

స్వచ్ఛధవళ ఫేన పంక్తులు పాదనఖాగ్ర చుంబిత మొనర్చుతూ వుంటే, పరిభ్రమిత హృదయంలో, భ్రమాయత్తమనస్విని, పరిభ్రమానుకూల పురుషుడి ఎట్టెదుట, భ్రమాకాశ తరంగిణివైె కూర్చుంది. శివజటాజూటాగ్ర ప్రతిష్ఠితాసన కాగోరి.

'ఇదిగో రమా!'

'ఊఁ!'

'ఎందుకు నా వెంటబడి ప్రాణం తీస్తుంటావ్?'

'నా ప్రాణం నిలుపుకో గోరి.'

'నువ్వంటే నాకిష్టంలేదని నీకెన్నిసార్లు చెప్పాలి.'

'ఎన్నోసార్లు ఆమాట చెప్పిన మీరు ఒక్కసారి ఇష్టమని చెప్పకూడదూ?'

'ఆ మాట నీదగ్గర ఖర్చుపెడితే జానకితో ఏం చెప్పను?'

జానకి మూర్తి ప్రేయసి, ఆ విషయం రమకు తెలిసిందే! మూర్తి అందగాడు! నిండువిగ్రహం! 'రైల్వే'లో ఉద్యోగం! రమకు ప్రాణం. హృదయంలో దేవుడు! గుండెల్లో ఊపిరి. శరీరంలో రక్తం! కళ్లల్లో చూపు!

'టీచర్' ఉద్యోగం చేస్తూ తండ్రి తెచ్చిన జీతం ఇంటికి అత్తుబొత్తుగా సరిపోతుంటే, తన జీతం పూర్తిగా, మూర్తికి, భక్తితో, ఫలపుష్పాలతో సమర్పించుకొంటుంది రమ.

జీతం వచ్చిన రోజు మూర్తి వస్తాడు. జీతం అయిపోతుంది. మూర్తి వెళిపోతాడు. రెండు రోజుల్లో నెలజీతం! ఆ తర్వాత కనిపించడు. తినో తినకో నెల గడుపుతుంది. ఒకటో తారీఖు వస్తుంది. మూర్తి వస్తాడు. మూడో తారీఖు వెళిపోతుంది. మూర్తి వెళిపోతాడు. నెలకు అయిదుసారులు అయినా ఒకటో తారీఖు వస్తే ఎంత బాగుండునూ అనుకొంటుంది రమ.

మూర్తి కావాలని అడగాలకాని రమ తలయినా తాకట్టు పెడుతుంది. లేదంటే అమ్మేస్తుంది. కాదంటే కోసి ఇస్తుంది.

ఆమెకదేం వెర్రో, పుట్టకతో బుర్రకా బుద్ధిపుట్టిందో, పుట్టి నేర్చుకొందో! మూర్తి అంటే పడిచస్తుంది. ఆ చావులో ఏ చావు అయినా చచ్చితీరవలసిందే!

దగ్గరుంటే తంతాడు. తంతానంటమూ, తన్నటమేకాని, మరి ఏమీ ఎరుగడు మూర్తి. తన్నినా, కోసినా, రాచి రంపాన పెట్టినా రమకు మూర్తే లోకం! మూర్తే—ముమ్మూర్తులా దైవం! మంచి మాట, మంచి చేత, చేతగాని బాపతు మూర్తి అనుకొంటారు అంటారు, ఎవరైనా చూచినా, విన్నా!

'రమా! నీ మెళ్లో ఆ హారం ఎంతో అందంగా వుంది!'

మూర్తి ఎప్పుడూ అట్లా మాట్లాడనూ లేదు. రమ విననూ లేదు. అదొక తరహా నిజంగా మెచ్చుకోలు!

'నాలుగు రోజుల్లో—దాంతో, జానకితో పెళ్లి! తెలుసుగా!'

'ఆఁ!'

'మరేంటి నీకింకా వెర్రి!'

'నా వెర్రితో మీ కెందుకు?'

'అడిగాడు—నాకు డబ్బు కావాలి.'

'ఎంతంటారు?'

'ఎంతేమిటి? ఎంతయినా సరే! ఎంత ఇవ్వగలవ్?'

'ఎంత కావాలో చెబితేగా మీరు?'

'ఎంతో కొంత పడెయ్. మరచిపోవద్దు—నాలుగు వందలివ్వు ఎప్పుడో ఒకప్పుడిస్తాను.'

'మీరివ్వటం నేను తీసుకోవటం—తెలియందేముంది?'

'అదంతా నాకు తెలియదు రేపు కావాలి.'

'ఇదిగో ఈ హారం అమ్మి తెచ్చి ఇస్తాను.'

ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా కూర్చున్నారు. సముద్రం నిశ్శబ్దంగా లేదు. ఆకాశం ఉరుముతూవుంది.

భూమి ఉరుముతూ వుంది. మూర్తి ఉరుముతున్నాడు. హృదయం ఉరుముతూ వుంది.

'పెళ్లయితే నేను గుర్తుంటానా?'

'ఎందుకు గుర్తుండవ్? ఉంటావు, ఉంటావు! రేపు సాయం కాలం డబ్బు తీసుకురా! వస్తావుకదూ! ఎదురుచూస్తూ వుంటాను. లేకపోయావో, ఇంతటితో మనకు సరి!'

—శివం.

* * * *

# 4

ఆమె నడుస్తూవుంది. నడకలో నాట్యం మొదలయింది. అంతకుముందు ఆమె టాక్సీ ఎక్కబోయింది. ఎందుకో ఆగింది. మళ్లీ ఎక్కబోయింది. ఎందుకో ఎక్కలేదు.

ఆమెనెప్పుడూ చూడకపోయినా ఎక్కడో చూశామని స్తుంది. ఆమె లోకంలోవున్న చాలా మందితో పోలిక కలిగి వుంది.

అవయవాలు తీర్చితిద్దినట్లున్నాయి. కోలముఖం, అలస సిన కళ్లు. కళ్లకింద నల్లగీతలు! కొంచెం లావుగావుంది. గ్రహం ఎత్తయింది. ఎత్తుకుతగిన లావు, పాతికేళ్లుండవచ్చు యస్సున్నా తెలియదు. ఆకర్షణవుంది.

దూరంగాపోయి ప్లాస్టిక్ బేగ్‌లోవున్న చిన్న పర్సుతీసి చిల్లరమాత్రమేవుంటే లెక్కపెట్టుకొంది. రూపాయికూడా లేదు. బేగ్‌లోనే బాక్స్—చిన్నది వుంది.

ఆమె అప్పుడే రైలు దిగింది. ఆదరాబదరా వెలుపలికి వచ్చింది. బేగ్ తప్ప వస్తువులేమీ లేవు. బేగ్ బరువుగావుంది. బలంగా వూపుకొంటూ సామాన్యంగా—అతిసామాన్యంగా నడవటానికి ప్రయత్నిస్తూ వుంది.

ఆమె రైల్లో ఎక్కేటప్పుడు బేగ్ బరువులేదు. రైలులోను బరువెక్కలేదు. రైలు దిగుతున్నపుడు బలం పుంజుకుంది. దిగింతర్వాత యాంత్రికంగా బరువెక్కింది.

ఆమె ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ప్రయాణం చేసింది ఆమెకు తోడు ఒక్కతే ప్రయాణికురాలు.

ఒకే వూరు పోతున్న ఇద్దరూ ఎక్కడికి పోతున్నారంటే ఎక్కడిదాకా అంటూ సంభాషణలోకి దిగారు.

ఆమె డాక్టర్ నని చెప్పింది. స్నేహితురాలు ప్రసవవేదన పడుతూవుంటే పోయి వస్తూంది. కాన్పు కష్టంలేదు. మగ పిల్లవాడు. గవర్నమెంటు హాస్పిటల్‌లో ఉద్యోగం డ్యూటీలో జాయిన్ కావటాని వస్తూవుంది.

పిల్లవాడు ఎర్రగా దొండపండులాగా వున్నాడు. ఎంతో చక్కగా వున్నాడు. చాల ముచ్చట గలిగింది. ఆ పిల్లవాణ్ణి చూచింతర్వాతే డాక్టరుకి పెళ్లిచేసుకోవాలనే తలంపు కలిగింది

రెండో ఆమె ఏమీ చదువుకోలేదు. ధనవంతుల బిడ్డ పల్లెటూరు. భర్త ఇంజనీరు. భర్త దగ్గరకు వెళుతూవుంది

జీతగాడు వెంట వస్తున్నాడు. వాడికి ఫస్టుక్లాసు టిక్కెట్టు దండుగ. థర్డ్‌క్లాసులో వున్నాడు.

ఇంజనీరు భార్య వంటినిండా నగలున్నాయి. ఇంకా రెండు నగల బాక్సులున్నాయి. వాళ్లిద్దరూ ఎన్నో సంగతులు మాట్లాడుకొన్నారు. కాసేపటిలోనే ఆత్మీయులైపోయారు.

ఏ నగ ఎంత ఖరీదో, ఇంజనీరు భార్య చెబుతూవుంది. డాక్టర్ ఆసక్తిగా వింటూవింది. ఒక బాక్సులోవున్న, అయిదు వేల ఖరీదుగల వజ్రాల హారంమీద ఆమె చూపు నిలిచింది. అలాంటిదే చేయించుకోవాలన్న కోర్కె కలిగిందనీ చెప్పింది.

ప్లాస్టిక్ బేగ్ బరువుగా వూపుకొంటూ ఆమె—డాక్టర్— నడుస్తూవుంది, గబగబా, నెమ్మదిగా, తొందరగా, నిదానంగా

ఇద్దరూ ఒకేసారి రైలు దిగారు. దిగీ దిగటంతోనే 'నే వెళతాను' అంది ఆమె.

'పోవచ్చు లెద్దురు. మా యింటికి రండి. వారిని పరిచయం చేస్తా' నంది ఇంజనీరు భార్య.

'లేదు! వెళ్లాలి! డ్యూటిలో జాయిన్ కావాలి' ఆమె బలవంతంగా బయలుదేరింది.

ఒంటరిగా రోడ్డుమీద నడుస్తూ వుంది. నడకలో నాణ్యత వుంది.

డాక్టర్ వెళ్లిపోయాక, జీతగాడు వచ్చేదాకా ఆగింది ఇంజనీరు భార్య. వాడు రావటం ఆలస్యమయితే మండి పడింది.

జీతగాడు సామానంతా తీసుకొని 'ఏందమ్మా వొజ్రాల ఆరం ఏది?' అన్నాడు. బాక్సుకోసం ఆమె చుట్టూ వెదికింది.

కంపార్టుమెంటులో చూచింది. ట్రంక్‌లో చూచింది లేదు. బేగ్‌లో చూచింది లేదు. ఏమైంది. పోయివుంటుంది. ఏడుపు వచ్చింది.

'ఏది?' అంది గద్గద స్వరంలో.

'నేనే అడుగుతూవుంటే ఏందమ్మా నన్నే అడుగుతా?' ఎదురుప్రశ్న వేశాడు జీతగాడు.

జీతగాడి కంతా అయోమయంగా వుంది.

ఆమెకు ఏదో అర్థమయినట్లు అనిపించింది. వెంటనే చెప్పింది. 'అదే! ఆ డాక్టర్! అదే తీసివుండాలి! అమ్మ దీని కడుపుడక' అంది.

'ఎవరా డాక్టర్ ఏందమ్మా! ఎవరామే?' ప్రశ్నించాడు. బాధగా అంతా చెప్పింది. చుట్టూ జనం పోగయ్యారు. తలాక సలహా ఇచ్చారు. రిపోర్టు ఇవ్వటమే నచ్చింది. జీతగాణ్ణి వెంట తీసుకుపోయి రిపోర్టు ఇచ్చింది. పోలీసులు ఆమెను చాలా ప్రశ్నించి, అడ్రస్సు తీసుకొన్ని, ఏ విషయం తెలియజేస్తామన్నారు.

ఆమె నెత్తీ నోరు కొట్టుకొంటూ వెలుపలికి వచ్చింది.

ఆమె కాఫీ హోటల్‌కు పోయింది. కాఫీ తాగుతూ ప్లాస్టిక్ బేగ్‌లోంచి, బాక్స్ వెలుపలికి లాగింది. బాక్స్ మూత చూసింది. మూత వేసింది. కాఫీ బిల్లు చెల్లించి హోటల్లోంచి రోడ్డుమీదికి వచ్చింది.

నడుస్తూవుంది. మిట్టమధ్యాహ్నం ఎండ మాడిపోతూ వుంది.

చిల్లరవున్న పర్సు చేత బుచ్చుకొని, ఛాక్స్, బేగ్ లోంచి లాగి, ఎవరూ చూడకుండా ప్లాస్టిక్ బేగ్ మురుగుకాలవలోకి విసిరింది.

నడుస్తూవుంది.

—మోహన్.

*　　*　　*

# 5

వసంత రాజమండ్రికి టిక్కెట్టు తీసుకొని రైలెక్కింది. చేతిలో బంగారు నగవున్న చిన్ని పెట్టెవుంది. అప్పటికి వసంత బి. ఇడి. పాసయింది. తమ్ముడు స్కూల్ ఫైనల్ పాసయ్యాడు. కాలేజీలో చేరేస్థితిలో వున్నాడు.

ట్రయినింగ్ లో చేరక పూర్వం ఆమె నాలుగేళ్లు అన్ ట్రెయిన్డ్ టీచర్ గా పనిచేసింది. ఆ స్కూలులో ముప్పయి అయిదేళ్ల తెలుగు మాష్టారి ఉద్యోగం చేసి, తండ్రి రిటైర్ అయ్యాడు. తండ్రి మాటను తీసివేయలేక కమిటీ మెంబర్సుతో చెప్పి హెడ్ మాష్టర్ ఆమెకా వుద్యోగం ఇప్పించాడు.

బి.ఇడి. పాసయిన వాళ్లు ఉద్యోగాలకు ఎగబడుతూవుంటే, ట్రయినింగ్ కాని వసంతకు స్కూల్ అసిస్టెంట్ గా వుంచటం కష్టమయి, ట్రయినింగ్ పూర్తి చేసుకురమ్మని హెడ్ మాష్టర్ చెప్పాడు. మాట కాదనలేక, ఉన్న వూళ్లో వుద్యోగం వదులుకోలేక, ఆమె ట్రయినింగ్ రాజమండ్రిలోనే పూర్తి చేసింది.

ఆ ఏడే తమ్ముడు కాలేజీలో చేరబోతున్నాడు. తన బ్రతుకు ఎట్లా చట్టు బండలయినా, తమ్ముడు పెద్ద ఆఫీసర్ కనీసం లెక్చరర్ అయినా కావాలని ఆమె పట్టుదల.

వసంత తల్లిదండ్రులు ఆస్థిపరులు కాదు. తండ్రికి ఏ సంపదలేదు. తల్లి చదువుకో లేదు. కమిటీస్కూల్ కావటంవల్ల పెన్షన్ ఏమీ రావటంలేదు. ఉన్నట్లు, లేనట్లుగా సంసారం సాగుతూ వుంది.

కుటుంబ ఖర్చులుపోను, ఉద్యోగం చేసిన నాలుగేళ్లలో ఆమె రెండువేలపై చిలుకు నిలువ వుంచుకొంది. రాజమండ్రిలో ట్రయినింగ్ పూర్తయేసరికి, నిలవున్న డబ్బంతా ఖర్చు అయిపోయి, వేయి రూపాయలు మాత్రమే మిగిలాయి.

వసంతకు చిరకాలంగా ఒక కోర్కెవుంది. చిన్నతనంలో బంధువుల పెళ్లిలో పెళ్లికూతురు మెడలో చంద్రహారం చూచింది. అటువంటి హారం తనూ కొనుక్కోవాలని ఎంతో కాలంగా ఆశ పెట్టుకొంది. అది అప్పుడు అయిదువందలకే వచ్చిందట. ఇప్పుడయితే వేయి అయినా అవుతుంది.

చాలకాలంగా పెళ్లప్పుడు కొనుక్కోవచ్చులే అనుకొంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రతి యేడు వెనుకకు పోతూవుంది. పెళ్లి అవుతుందో లేదో అంతా చుక్కెదురుగా వుంది.

ఆ మధ్య ఆమె మనస్థితిలో మార్పు వచ్చింది. తమ్ముడు చదువు పూర్తి అయి ఉద్యోగంలో చేరిందాకా తను పెళ్లి చేసుకోకూడదు. అమ్మకూ, నాన్నకూ తమ్ముడి అండ వచ్చిందాకా వసంత పెళ్లికి సంసిద్ధురాలు కాదు.

ఆ పరిస్థితుల్లో, ఎప్పుడవుతుందో తెలియని పెళ్లిదాకా, కోరికలను చంపుకోలేక, ట్రయినింగ్ పూర్తికాగానే, బంగారు షాపుకుపోయి, మిగిలిన డబ్బుతో తనకు నచ్చిన హారం కొనుక్కొంది వసంత. రశీదు తీసుకొంది. స్వగ్రామం వెళ్లిపోయింది.

తల్లిదండ్రులకు చంద్రహారం చూపింది. ఒకప్రక్క వాళ్లు సంతోషిస్తూ, ఆ మాత్రం తాము కొనివ్వలేక పోయామే అని చింతించారు.

గుడ్డిలో మెల్లలాగా ఆ వేసవి ఆనందంగానే గడించిందని చెప్పాలి. మళ్లీ స్కూల్ తెరిచేలోగా ఇంటి ఖర్చులకీ అప్పులు చేయవలసి వచ్చింది. వసంత ఉద్యోగం ఆమెకేవుంది.

అనుకొన్నట్టుగా తమ్ముడికి కాలేజీలో సీటువచ్చింది. జీతం కట్టి చేరవలసిన రోజుకూడా దగ్గరపడింది. చేతిలో డబ్బులేదు. అప్పు తెద్దామంటే పుట్టే అవకాశంకూడా ముఖ్యమయింది.

ఎంత లేదన్నా, తమ్ముడి కాలేజి ఫీజ్‌కి, బట్టలకి, పుస్తకాలకి, హాస్టల్ డిపాజిట్టుకి, కనీసం నాలుగు వందలయినా కావాలి. మొదట ఆ మాత్రం పైకంవుంటే ఆ తర్వాత తన జీతంతో, ట్యూషన్లమీద వచ్చే డబ్బుతో, ఎలా అయినా సర్దుకుపోవచ్చు.

అంత డబ్బు ఎలా తేవాలి? ఎక్కడ తేవాలి? అంతులేని సమస్య అయిపోయింది.

ఆమెకు మెరుపు మెరిసినట్టు ఒక ఆలోచన తట్టింది. చంద్రహారం అమ్మితే?—అమ్మితే అన్ని ఇబ్బందులూ తీరుతాయి. ఎప్పుడో డబ్బున్నప్పుడు కొనుక్కోవచ్చు ననుకొంది.

అమ్మా నాన్నలు ఆ విషయం అంగీకరించలేదు. తమ్ముడు కోపంతో మండిపడ్డాడు. తను చదువయినా మానుకొంటా నన్నాడు. అందరూ వారించారు. ఆమె ఎవరిమాట వినలేదు. తమ్ముడి భావిజీవితం తలచి, హారం అమ్మక తప్పదని రాజమండ్రి బయలుదేరింది. హారంకొన్న రసీదు పెట్టెలోనే వుంది.

రాజమండ్రి స్టేషనులో రైలు దిగేసరికి సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. ఎండాకాలం ఎండ తీవ్రంగా వుంది.

ఇంటిదగ్గర బయలుదేరుతున్నపుడు, ఏ షాపులో కొన్నదో, ఆ షాపులోనే అమ్ముదామనుకొంది. తీరా రాజమండ్రి వచ్చాక అభిప్రాయం మార్చుకొంది. ఆ షాపులోనే అమ్మలేనని, ఆ బాధ సహింపలేననీ, తలంచింది. మరొక షాపులోకి పోయింది.

షాపులో అయిదునిమిషాలు వుంది. చంద్రహార పెట్టెతో వెలుపలికి వచ్చింది. వళ్లంతా చెమటపట్టింది. మనిషి నిలువునా వణికిపోతూవుంది. కళ్లలో బాధ, నిరాశ, కోపం తీవ్రంగా రూపుదాల్చాయి.

ప్రక్కనేవున్న తను హారం కొన్న షాపులోకి పోబోయింది. ఎందుకో పోలేకపోయింది. ఏంచేయాలో తెలియలేదు. తమ్ముడి అవసరం. తను మోసపోయానని దిగులు. గుండె దేవినట్లయింది. గిలగిల లాడింది.

హార పెట్టె చూచుకొంది. రశీదు చూచుకొంది. ప్రతీకార వాంఛ నాగుబాముయి బుసకొడుతూ వుంది. విషం కక్కుతూ వుంది. నేనే పురుషుణ్ణె అయితే—అయితే, ఈపాటికి వాణ్ణి

చంపి, చంపి, చంపి పారేద్దును అనుకొంది. వళ్లంతా నిప్పు లేకుండా మండిపోతూ వుంది.

ఏమవుతుందోనని దిగులు. ఏమన్నా అయితే ఎలా అని భయం. నిరాశం, ప్రతీకార కాంక్షతో ద్వేషం ఆమె ఉడికి పోతూవుంది.

ఆమె పోలీసు స్టేషన్‌కు పోయింది. అయిదు నిమిషాలలో వెలుపలికి వచ్చింది.

వసంత ముందు వెడుతూవుంది. వెనుక సర్కిల్, సబిన్స్పెక్టర్ వస్తున్నారు.

—రాణి.

* * * *

సూచన:—ఈ కథ ఒక ప్రయోగం. కథా శిల్పములో ఒక నూత్న ప్రయత్నం. జీవితంలోనూ, సాహిత్యంలోనూ, ముగింపు ఆధారంగా పూర్వ రంగం వూహించుకొంటారు విజ్ఞులు. ఒక సంఘటనను చూచి, నలుగురూ నాలుగు విధాలుగా వూహించుకొనే అవకాశముంది. ఒక వూహకు మరొక వూహతో సంబంధం వుండకపోవచ్చు. ఆ నలుగురూ అభిప్రాయాలు వ్యక్తీకరింపగల రచయితలు అయితే నాలుగు విధాలుగా రచించవచ్చు.

ఒక రచయిత, ఒక సంఘటనను చూచి, పూర్వ స్థితి వూహించి కథ వ్రాస్తే అది ఒక కథ కావచ్చు. అయిదుగురు రచయితలు తమతమ దృక్పథాలనుంచి వూహించి, ఆ సంఘటనను ముగింపుగా ఉంచుకొని కథలు

అల్లితే, వారి వారి మనస్తత్వానికి అనుగుణంగా అయిదు కథలు ఒకే ముగింపుతో తయారుకావచ్చు. క్రొత్త శిల్ప స్ఫూర్తి ఉండవచ్చు.

అదే ఈ కథలో శిల్పం. ముగింపు ఆధారంగా, అయిదు విధాలుగా దాని పూర్వ రంగం ఎలా వూహించు కొంటారో వూహించి, ఈ కథ వ్రాశాను. సుధ, రఘు, శివం, మోహన్, గాణి, నేను కల్పించిన రచయితలు, రచయిత్రులు. వాళ్లు ఈ విధంగా వూహించే అవకాశం వుందని వూహించి అయిదు కథలు — ఉపసంహారానికి పూర్వ రంగంవంటివి వ్రాశాను. ఆ అయిదు కథలకు పరస్పరం సంబంధం లేదు. ఇక పైనున్నది ఉపసంహారం ఆ అయిదు కథలకు సమిష్టిగా కాక, వ్యష్టిగా ముగింపుతో సంబంధం వుంది. ఇక చదవబోయే ముగింపు, ఆ అయిదు కథలకూ వేరువేరుగా ముగింపు.]

—రచయిత.

## ముగింపు

ఆమె రోడ్డుమీద మామూలుగా నడవాలనుకొంటూ త్వరగా నడుస్తూవుంధి. ఆ తొందర భయంవల్లనో, కోపం వల్లనో, దిగులువల్లనో, లజ్జవల్లనో తెలియదు.

ఆమె ముఖంలో ఏ విధమైన భావమూ లేదు. అన్ని భావాలకూ అతీతంగా కనిపిస్తూవుంది.

ఆమె తలలో పూలున్నాయి. మెడలో తాళిలేదు చేతులకు గాజు లున్నాయి. నుదుటిమీద బొట్టు వుంది.

ఆమె నడకలో మామూలుగా వుండే సంగీతం శ్రుతి తప్పుతూ వుంది. రోడ్డు కడ్డంగా అటునుంచి ఇటు వచ్చింది. పరుగెత్తినట్లు వచ్చింది. అయితే ఆమెకా భావంలేదు.

ముందు ఎక్కడో, దూరంగా, కనిపించని లక్ష్యం చూస్తూ వుంది.

వెనకూ, ముందుకూ చూస్తూ వుంది.

గుండె వేగంగా కొట్టుకుంటూ వుంది. ఆగి, ఆగి నిట్టూర్పు వినబడుతూ వుంది.

ఆమెను చూస్తూ, ఆమెకు కనిపించకుండా యువకుడు వెనుకగా నడుస్తున్నాడు. అతనికి ముందు సబిన్స్పెక్టర్, సర్కిల్ వస్తున్నారు. చెట్టు క్రిందనుండి రిక్షావాడు వచ్చాడు. టాక్సీ డ్రైవర్ ఆమెను చూస్తూ వెళ్లిపోయాడు. కిళ్లీకొట్టు దగ్గర ఎవరో నమలుతున్న కిళ్లీ కాండ్రించి వుమ్మివేశాడు. కాలేజీ విద్యార్థిని ఆమెను చూస్తూ నిలబడిపోయింది. హైస్కూలులో ఉపాధ్యాయిని ఏదో గొణుక్కుంటూ పోయింది.

ఎండలో సూర్యుడు మండి పోతూన్నాడు. నేలలోంచి వెచ్చటి ఆవిరి వస్తూవుంది.

చేతిలోవున్న బాక్స్‌వైపు చూచుకొంది. కళ్లలో ఆశ తొణికిసలాడింది. గాఢమైన నిట్టూర్పు వెలివడింది. ఆమె నడుస్తూవుంది. నడకలో నాజూకుతనం తరగలేదు. పెరగలేదు.

రోడ్డు మలుపులో ఆగి, మెడమీద చెమట తుడుచుకొంది. కళ్లు అద్దుకొంది. ముఖమంతా పైటచెంగుతో ఒత్తుకొంది.

ఆమె బంగారపు షాపులోకి ప్రవేశించింది. షేట్ యథాలాపంగా చూశాడు. మిగతావాళ్లు ఏం కావాలి

అన్నట్లు లేచి నిలబడ్డారు. అందరివైపు చూచి ఆమె షేట్ దగ్గరకు పోయింది.

షేట్ ఆమె కళ్లలోకి చూశాడు. ఆమె కళ్లు చెప్పే మాటలు వినటంకోసం!

అద్దాల బీరువాకు ఇవతల ఆమె, అవతల షేట్ నిలుచునే వున్నారు.

'ఏమండీ!' అన్నాడు షేట్.

'ఈ హారం!' అంది.

'ఏం? ఇలా ఇవ్వాండి?'

ఆమె చేతిలోవున్న కేస్ బీరువా అద్దంమీద పెట్టింది. షేట్ తీసుకొన్నాడు. మూత తీశాడు. లోపల హారం వుంది. మెరిసిపోతూవుంది.

'హారం అమ్ముతాను' ఆమె చెప్పింది.

దాన్ని అటు ఇటూ తిప్పి చూశాడు దగ్గరగా-దూరంగా చూశాడు.

'ఏం? ఎందుకు అమ్మటం?'

'అమ్ముతాను! అంతే!'

ఆమె ముఖంలోకి సంశయ నివృత్తితో చూశాడు. గీటు రాయిమీద ఒరపిడి పెట్టాడు. చూశాడు. కళ్లు పెద్దవి చేసుకొని చూశాడు. చివరికి పెదవి విరిచాడు.

ఆమె ఆసక్తిగా చూస్తూవుంది.

షేట్ చెప్పాడు.

'ఇది బంగారం కాదు!!!'

ఆమె వింది. నిలువునా చలించిపోయింది. గుండెలో అంతర్యమైన భావ సంచలనం బయలుదేరింది. ముఖంలో కత్తి వ్రేటున నెత్తురు చుక్క లేదు.

ఆమె ఏమో అనబోయింది. అనలేదు. అంతలో సర్కిల్, సబిన్స్పెక్టర్, షాపులోకి ప్రవేశించారు. షేట్ లో తొందర బయలుదేరింది.

ఆమెలో వ్యక్తంకాని, ఆనందం, తొందర, భయం ముప్పిరి గొన్నాయి.

బీరువా అద్దం మీదవున్న హార పెట్టెలో హారం పెట్టి, మూత వేసి, సర్కిల్, సబిన్స్పెక్టర్లు చూడకుండా బీరువాల్లో ఇతర పెట్టెలమధ్య పెట్టి, ఏమీ ఎరుగనట్లు నిలబడ్డాడు షేట్.

షేట్ తన బాక్స్ ఎక్కడ ఉంచిందీ ఆమె చూచింది. అద్దంలోంచి బాక్స్ కనిపిస్తూ వుంది. ఆమె షేట్ ముఖంలోకి అర్థోవిధంగా చూచింది.

సబిన్స్పెక్టర్ వాకిట్లో నిలబడే వున్నాడు. సర్కిల్ షేట్ దగ్గరకు వచ్చి ఆమె ముఖంలోకి చూస్తూ వున్నాడు.

* * * *